
# స్ఫూర్తి



'ఆంధ్రభూమి' దినపత్రిక . . . *19* మార్చి, *2005*

"మిడిల్ స్టంప్!"

- బ్యాట్‌ని మిడిల్ స్టంప్ ఎదురుగా పెట్టి అంపైర్ వైపు చూస్తూ అన్నాడు ప్రశాంత్.

అంపైర్ సూచించిన స్థానంలో బ్యాట్ పెట్టి, గార్డ్ తీసుకున్నాడు. తర్వాత లెగ్‌స్టంప్ గార్డ్ కూడా తీసుకుని, ఒక్కసారి ఫీల్డింగ్ ప్లేస్‌మెంట్స్ చూసుకుని, బ్యాట్ భూమికానించి, బంతి ఎదుర్కోవడానికి సిద్ధమై నిల్చున్నాడు.

హైదరాబాద్, తమిళనాడుల మధ్య హైదరాబాదులో జరుగుతున్న రంజీ మ్యాచ్ అది!

తమిళనాడు ఫేస్‌బౌలర్ గణేష్ బంతిని విసరడానికి శరవేగంగా రాసాగాడు.

ప్రశాంత్ ఒక్క క్షణం కళ్ళుమూసుకుని, భగవంతుణ్ణి స్మరించి, కనులు తెరిచి ఏకాగ్రతతో చూడసాగాడు.

బంతి బౌలర్ చేతినుంచి విడివడి, పిచ్ మధ్యలో పడి, ఆఫ్ స్టంప్‌కి దూరంగా వెళ్తోంది.

వెంటనే బ్యాక్‌ఫుట్ వేసి బంతిని స్క్వేర్‌కట్ చేశాడు ప్రశాంత్. బంతి బుల్లెట్‌లా బౌండరీ వైపు పరిగెత్తింది. అంపైర్ బౌండరీ సిగ్నల్ ఇవ్వడం చూసి తీస్తున్న పరుగు ఆపాడు.

తరువాతి బంతి స్టంప్‌ల మీదకి వచ్చింది. ప్రశాంత్ బ్యాట్ అడ్డంగా పెట్టకపోయివుంటే మిడిల్ స్టంప్ ఎగిరి ఉండేది.

తరువాతి బంతి లెగ్‌సైడ్ వేశాడు గణేష్.

అతివేగంగా వచ్చిన ఆ బంతిని మోకాళ్ల మీదకి వంగి హుక్ చేశాడు ప్రశాంత్. బంతి ప్రేక్షకులున్న స్టాండ్‌లో పడింది.

ప్రశాంత్ తన కళ్ళను తానే నమ్మలేకపోయాడు. 'తను ఎదుర్కొన్న మూడు బంతుల్లో పది పరుగులు చేశాడు' ...అన్న నిజం అతనికి ఎంతో ధైర్యాన్నిచ్చింది.

లంచ్ సమయానికి పాతిక పరుగులు చేశాడు ప్రశాంత్.

డ్రెస్సింగ్ రూమ్‌లోకి అడుగుపెట్టగానే అతని సెల్ మ్రోగింది.

ఆ కాల్ ఎక్కడ్నుంచో అతనికి తెలుసు...

అందుకే సెల్‌లో నంబరు చూడకుండానే "అమ్మా..." అన్నాడు.

"ప్రశాంత్! చాలా బాగా ఆడావురా! సెంచరీ చెయ్యాలి నువ్వు!"

"థాంక్యూ అమ్మా... థాంక్యూ!"

తను క్రికెటర్ కావడానికి తన తల్లి పడ్డ కష్టం అతనికి తెలుసు. చాలామంది తల్లుల్లా ఆవిడ కొడుకుని 'ఎంసెట్' అంటూ ఇబ్బంది పెట్టక, అతని అభిరుచి మేరకు అతన్ని క్రికెటర్‌ని చేసింది. అందుకోసం ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులు ఎదురైనా ఆమె బాధపడలేదు, భయపడలేదు. అతనికి తండ్రిలేని లోటు తెలియకుండా తల్లీ, తండ్రీ తానే అయి పెంచింది.

"ఉంటారా... జాగ్రత్తగా ఆడు!"

"అలాగే అమ్మా..!"

సెల్ ఆఫ్ చేయగానే- మళ్లీ రింగ్‌టోన్ వినిపించింది. సెల్ ఆన్ చేసి, "హలో..." అన్నాడు.

"హలో ప్రశాంత్‌గారూ! నేను ఓ క్రికెట్ అభిమానిని. మీరు చాలా బాగా ఆడారు. కంగ్రాట్స్!"

"థాంక్యూ..." అన్నాడు- ఆమె తీయని కంఠం అతనిలో తీయని భావాలు కలిగించాయి.

"మీరు బ్యాక్‌ఫుట్ షాట్స్ చాలా బాగా ఆడుతున్నారు. అయితే అలా ఆడడం అవుటాఫ్ ఫ్యాషన్ అన్న అభిప్రాయం మీకున్నట్లుంది. నిజానికి మీకు ఆ షాట్ల వల్లే ఎక్కువ పరుగులు వచ్చాయి. పైగా... ఈరోజుల్లో ఎన్ని పరుగులు చేశాడన్నదే చూస్తారు- ఎలా చేశాడన్నది చూడరు. కాబట్టి ఎలాంటి సంకోచాలు లేకుండా ఆడండి... మీరు సెంచరీ చెయ్యాలి యీరోజు!"

"తప్పకుండా! మీ పేరు?"

"ప్రియ..!"

"నాకు ఇష్టమైన పేరు. ఎక్కడ్నుంచి మాట్లాడుతున్నారు?"

"స్టేడియం నుంచే..!"

"మీ సలహా తప్పకుండా పాటిస్తాను. నామీద మీ కన్సర్న్‌కి చాలా థాంక్స్!"

●

లంచ్ తర్వాత పరుగుల వరద సృష్టించాడు ప్రశాంత్.

టీ విరామానికి పది నిమిషాల ముందే సెంచరీ పూర్తిచేశాడు.

నూరవ పరుగు పూర్తిచెయ్యగానే బ్యాట్ ఎత్తి తన తోటి ఆటగాళ్ళుండే స్టాండ్‌వైపు బ్యాట్ చూపిస్తూ అభివాదం చేశాడు. తర్వాత ప్రేక్షకుల వైపు బ్యాట్ చూపించాడు. 'ఈ జనంలో ఎక్కడో ఒకచోట ప్రియ కూర్చుని ఉంటుంది. ఆమెకు కూడా ఈ అభివాదం!' అనుకున్నాడు మనసులో.

టీ విరామంలో తల్లి నుంచి ఫోన్ వచ్చింది అతనికి. తర్వాత అతను ఊహించినట్టు ప్రియ నుంచి కాల్ వచ్చింది.

"కంగ్రాట్స్... సాధించారు. అంత ధైర్యంగా షాట్లు ఎలా ఆడగలిగారు?"

"పిచ్ బ్యాటింగ్‌కి అనుకూలంగా ఉంది. బంతి బాగా కనిపిస్తోంది. జస్ట్ టైమింగ్... అంతే!"

"డబుల్ సెంచరీ చేస్తారా?"

"ఏమో! ఆ విషయం ఆలోచించలేదు."

"ఆలోచించకండి... ఆడండి! మనిషికి ధనదాహం ఉండకూడదేమో కాని, క్రికెట్ ప్లేయర్‌కి పరుగుల దాహం ఉండితీరాలి."

అతనికి నవ్వొచ్చింది ఆమె మాటలకు.

"ప్రయత్నిస్తాను..." అన్నాడు.

"ఓ.కే. ఉంటానండీ... ఆల్ ది బెస్ట్!"

"మళ్లీ ఎప్పుడు చేస్తారు?" అతనికి ఆమె స్వరం మళ్లీ మళ్లీ వినాలనిపిస్తోంది.

"మీ డబుల్ హండ్రెడ్ అయ్యాక..!"

"అంతకుముందు చెయ్యరా..?"

"మీరు డబుల్ సెంచరీ చెయ్యకపోయినా నేను ఫోన్ చేయను. నేను మీకు ఫోన్ చేయాలంటే మీరు డబుల్ సెంచరీ చెయ్యక తప్పదు."

"ఇది చాలా అన్యాయం!"

"న్యాయమే! ముద్దబంతిలాంటి అమ్మాయితో స్నేహం కావాలంటే రేపంతా మీరు బంతితో సహవాసం చెయ్యాలి. పైగా పాకిస్తాన్‌తో జరిగే హోమ్ సిరీస్‌కి ఈ రంజీమ్యాచ్‌లో రాణించిన ఆటగాళ్ళను తీసుకుంటారన్న విషయం మీకు తెలుసు కదా!"

"అఫ్‌కోర్స్... తెలుసు!"

"అయితే డబుల్ సెంచరీ చెయ్యండి. ఉంటాను..!"

ఆ మ్యాచ్‌లో ప్రశాంత్ డబుల్ సెంచరీ చేయడమే కాదు- 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డుని కూడా అందుకున్నాడు.

ప్రియ నుంచి అభినందనల్ని కూడా అందుకున్నాడు.

●

కొరియర్ అతను తెచ్చిన ఉత్తరాన్ని చించి చదవసాగాడు ప్రశాంత్...

"ప్రశాంత్ గారికి,

మీరు పాకిస్తాన్‌తో జరగబోయే టెస్ట్ సిరీస్‌కి ఎన్నికయ్యారని టీవీ న్యూస్‌లో చూశాను. క్రికెట్ చరిత్రలో గవాస్కర్, కపిల్ దేవ్, టెండూల్కర్‌లాంటి గొప్ప క్రికెటర్ల సరసన మీ పేరు నిలిచిపోవాలి.

అభినందనలతో..

– మీ

ప్రియ."

ఆ ఉత్తరం ప్రశాంత్‌కి ఎంతో ఆనందాన్ని, ప్రోత్సాహాన్ని ఇచ్చింది.

●

పాకిస్తాన్‌తో మొదటి టెస్టు హైదరాబాద్‌లో ప్రారంభమైంది.

అది ప్రశాంత్‌కి హోమ్‌గ్రౌండ్!

జాగ్రత్తగా ఆడి హాఫ్ సెంచరీ పూర్తిచేశాడు. సెంచరీకి నాలుగు పరుగుల దూరంలో ఉన్నప్పుడు ప్రశాంత్ అవుటయ్యాడు. వెంటనే కోపంగా బ్యాట్‌తో నేలను గట్టిగా కొట్టి బాధగా వెనుతిరిగాడు.

స్టేడియంలో ఆటగాళ్ళకు కేటాయించిన స్టాండ్‌లో కూర్చుని ఉన్న ప్రశాంత్ దగ్గరికి ఓ పిల్లవాడు వచ్చి ఓ కాగితం అతని చేతిలో పెట్టి వెళ్లిపోయాడు.

ప్రశాంత్ కాగితం మడత విప్పి చదవసాగాడు...

"ప్రశాంత్‌గారూ...

కంగ్రాట్స్ ఫర్ యువర్ నైన్టీసిక్స్ రన్స్!

సెంచరీ చెయ్యలేదన్న బాధ మీలో ఉంటుంది. కాని, ఇదే మీ చివరి మ్యాచ్ కాదు కదా! ఈ మ్యాచ్‌లో చేసిన పరుగుల వల్ల మీరు మరో మూడు టెస్టు మ్యాచులు ఆడటం ఖాయం! అంటే... కనీసం మూడు సెంచరీలు చేసే అవకాశం మీకుంది కాబట్టి నిరుత్సాహపడకండి. మీరు ఔటవ్వగానే బ్యాట్ నేలకేసి కొట్టడంలాంటివి భవిష్యత్తులో చెయ్యకండి. ఎందుకంటే...

అవి మంచి స్పోర్ట్స్‌మన్ చేసే పనులు కావు. మైదానంలో మీ ప్రతి చర్యా టీవీలో లక్షల మంది చూస్తుంటారని మర్చిపోకండి. గొప్ప క్రికెటర్‌గానే కాదు, గొప్ప వ్యక్తిగా కూడా మీరు ఎదగాలి. సాధారణమైన మనుషుల్లా మీ ప్రవర్తన ఉండకూడదు.

ఈ టెస్ట్‌లో ఇంకో ఇన్నింగ్స్ ఆడే అవకాశం మీకొస్తే మీరు సెంచరీ చేస్తారు.

ఆల్ ది బెస్ట్!

- ప్రియ."

ఆ టెస్ట్ 'డ్రా'గా ముగియడంతో ప్రశాంత్‌కి మళ్లీ బ్యాటింగ్ చేసే అవకాశం రాలేదు.

●

టెస్ట్ సిరీస్ ముగిశాక 'మ్యాన్ ఆఫ్ ది సిరీస్' అవార్డుకు ప్రశాంత్‌ని ఎంపిక చేశారు.

అందరి కరతాళ ధ్వనుల మధ్య ప్రశాంత్ ట్రోఫీ అందుకున్నాడు.

ఆ ప్రెజెంటేషన్ సెరిమనీకి వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్న మాజీ క్రికెట్ ప్లేయర్, ప్రశాంత్‌ని ఇంటర్వ్యూ చేస్తూ-

"ఎలా ఫీలవుతున్నారు మీరు?" అని అడిగాడు.

"ఈ సిరీస్‌ని ఇండియా గెలవడం నాకెంతో సంతోషంగా ఉంది. ఈ గెలుపుకి ఇతోధికంగా నేనూ తోడ్పడినందుకు నాకు ఎంతో ఆనందంగా ఉంది. నన్ను క్రికెటర్ చేయడానికి ఎన్నో కష్టాలు భరించి, అనుక్షణం నా సంతోషం కోసం తపించిన మా అమ్మకి, నన్ను ఎంతగానో ప్రోత్సహించిన నా టీమ్‌మేట్స్‌కి, నా స్నేహితురాలు ప్రియకు ఈ 'మ్యాన్ ఆఫ్ ది సిరీస్' ట్రోఫీ అంకిత మిస్తున్నాను" అన్నాడు ప్రశాంత్.

టీవీలో ఆ సన్నివేశాన్ని చూసిన ప్రియ ఎంతో ఎగ్జయిట్‌మెంట్‌కి లోనయింది. ప్రశాంత్ అంటే ఎంతో గౌరవభావం కలిగింది ఆమెకి.

●

ప్రియ ప్రశాంత్‌కి ఫోన్ చేసింది...

"మ్యాన్ ఆఫ్ ది సిరీస్‌కి అభినందనలు!"

"థాంక్యూ..."

"మీ ధైర్యానికి కూడా నా అభినందనలు!"

"ఏ విషయంలో..?"

"ప్రెజెంటేషన్ సెరిమనీలో నా పేరు ప్రస్తావించారు. మామూలుగా అటువంటి అకేషన్స్‌లో స్నేహితురాళ్ళ పేర్లు చెప్పరు. ఎందుకంటే ప్రెస్‌వాళ్ళు ఆ అమ్మాయితో లింకు పెట్టి రాస్తారన్న భయం వల్ల!"

"నన్ను ప్రోత్సహించిన వారికి కృతజ్ఞతలు చెప్పడం నా కనీస ధర్మం!"

"అటువంటి గొప్ప అకేషన్‌లో కూడా ప్రోత్సహించిన వారు మీకు గుర్తుకురావడం మీ సంస్కారం. నేను మీ ఇంటికి రావాలనుకుంటున్నాను."

"తప్పకుండా రండి... మిమ్మల్ని చూడాలని నాకూ ఉంది."

"మీకు ఎప్పుడు తీరిక దొరుకుతుందో చెబితే అప్పుడు వస్తాను. ఎంతైనా క్రికెట్ స్టార్ మీరు!"

"ఆదివారం ఉదయం రండి... బిజీగా ఉంటానని కాదు, ప్రశాంతంగా మాట్లాడుకోవచ్చని! మా ఇంటి అడ్రెస్ చెప్పనా?"

"నాకు తెలుసు..!"

"మీకెలా తెలుసు?"

"అక్కడికి వచ్చాక చెబుతాను. సండే మార్నింగ్- నైన్ థర్టీ- ఓ.కే..?"

"ఓ.కే.!"

●

ఇంటి బయట కారు ఆగిన శబ్దం వినగానే ప్రశాంత్ బయటకి వచ్చి చూశాడు.

ఓ అందమైన పాతికేళ్ల అమ్మాయి కారులోంచి దిగుతోంది.

ప్రశాంత్ ఆమెను సమీపించి "నమస్తే..." అన్నాడు చేతులు జోడించి.

"నమస్తే..." నవ్వుతూ చేతులు జోడించి అంది ప్రియ.

"రండి లోపలికి!" అంటూ ఇంట్లోకి ఆహ్వానించాడు.

ఆమె సోఫాలో కూర్చున్నాక "ప్రియగారూ... మిమ్మల్ని ఎక్కడో చూసినట్లు నాకనిపిస్తోంది!" అన్నాడు.

ఆమె నవ్వుతూ "ఎక్కడ చూశారు?" అని అడిగింది.

"అదే గుర్తుకురావడం లేదు."

"నెమ్మదిగా గుర్తుచేసుకోండి! అన్నట్టు... మీ అమ్మగారేరి?"

"లోపలుంది. వస్తుంది..."

"మా ఇల్లు ఎలా తెలుసు మీకు?" ప్రశాంత్ అడిగాడు.

"మేము ఒకప్పుడు మీ ఎదురింట్లో ఉండేవాళ్ళం. అందువల్ల తెలుసు."

"మీరు... మా ఎదురింట్లో ఉండేవారా?" ఆశ్చర్యంగా అడిగాడు ప్రశాంత్.

"అవును. అంతకుముందు మెహిదీపట్నంలోని మా సొంతింట్లో ఉండేవాళ్ళం. మా నాన్నగారికి వ్యాపారంలో నష్టం రావడంతో ఆ ఇంటిని బిల్డర్‌కి అమ్మేశాం. ఆ బిల్డర్ ఆ స్థలంలో కట్టబోయే ఫ్లాట్స్ నుంచి ఒక ఫ్లాటు మాకు ఫ్రీగా ఇచ్చేట్టు అగ్రిమెంటు రాసుకున్నాం. అంతవరకూ మేము ఉండటానికి ఒక ఇంటిని చూసిపెట్టాడు. మీ ఇంటి ఎదురుగా ఉన్న బిల్డింగ్‌లో ఓ ఫ్లాటు అది!"

"నేను మిమ్మల్ని ఎప్పుడూ చూడలేదే?"

"నేను మిమ్మల్ని ప్రతిరోజూ చూసేదాన్ని! నా గది కిటికీలోంచి మీ ఇల్లు బాగా కనిపించేది. మీ మాటలు వినిపించేవి. మీరు ఉదయం ఆరుగంటలకు లేచి త్రాడుకు వ్రేలాడగట్టిన బంతిని బ్యాట్‌తో కొడుతూ ప్రాక్టీస్ చేసేవారు. అలా బ్యాట్‌తో బంతిని కొడుతూంటే మీ ముఖంలో ఏకాగ్రత, పట్టుదల స్పష్టంగా నాకు కనిపించేది. ఏడు గంటల నుంచి మన ఇంటిప్రక్కనే ఉన్న మైదానంలో మీరు మీ ఫ్రెండ్స్‌తో క్రికెట్ ప్రాక్టీస్ చేయడం చూసేదాన్ని. ఒక్కోసారి ఎవరూ రాక

మీరు నిరుత్సాహంతో కూర్చునివుంటే 'నాకు బౌలింగ్ వచ్చివుంటే మీకు సహాయం చేసేదాన్ని కదా!' అనుకుని బాధపడేదాన్ని. ఆ సమయాన్ని కూడా మీరు క్యాచ్ ప్రాక్టీసుకి వాడుకుంటూంటే మనిషి 'టైము చాలడం లేదు' అనడం ఎంత అర్థంలేని మాటో నాకర్థమైంది. అప్పుడే నాలో గిల్టీకాన్షస్ మొదలైంది..."

"ఎందుకు?" ప్రశ్నార్థకంగా చూశాడామె వైపు.

"నాకు మంచి గళం ఉందని గుర్తించిన మా నాన్నగారు నాకు చిన్నప్పుడే సంగీతం టీచర్ని ఏర్పాటుచేసి సంగీతం నేర్పించారు. స్కూల్లో చదివేటప్పుడు కొన్ని టీవీ ప్రోగ్రాముల్లో కూడా పాల్గొన్నాను. మెడిసిన్‌లో సీటు రాకపోవడంతో బి.ఎస్.సి.లో చేరాను. అప్పట్నుంచీ సంగీతంలో సాధన చెయ్యమని నాన్నగారు పోరేవారు. నేను ఆయన తృప్తికోసం గంటో, అరగంటో సాధన చేసి మిగిలిన సమయంలో టీవీలో ప్రోగ్రాములు, సినిమాలు చూస్తూ గడిపేదాన్ని. పైగా క్రికెట్ మ్యాచ్‌లు వస్తున్న రోజుల్లో ఇంకే పనీ చేసేదాన్ని కాదు. అయితే మంచి గాయని కావాలన్న ఆశ మాత్రం చాలా ఉండేది. టీవీలో సింగర్స్‌తో ఇంటర్వ్యూలు, ప్రోగ్రాములు చూస్తుంటే మనసులో లోటుగా ఫీలయ్యేదాన్ని. మా నాన్నగారు- 'ఘంటసాల గారు రోజుకు పదహారు గంటలు సాధన చేసేవారనీ, అందుకే ఆయన అంత గొప్ప గాయకుడు అయ్యారనీ, మనిషికి ఏదో ఒక ధ్యేయం ఉండాలనీ, అది సాధించేందుకు తగిన కృషి చెయ్యాలనీ' నాతో చెప్పేవారు. అయితే నాలోని సోమరితనం నాచే సాధన చెయ్యనిచ్చేది కాదు."

ప్రశాంత్ ఆమెనే చూస్తూ శ్రద్ధగా వినసాగాడు.

"సరిగ్గా ఆ సమయంలో మీరు చేస్తున్న కృషి చూశాను. నిద్రనీ, విశ్రాంతినీ మీరు త్యాగం చేసి చలిలో, మండుటెండలో సాధన చేయడం చూశాక నేను సమయాన్ని ఎంత వృధా చేస్తున్నానో అర్థమైంది. వెంటనే మూలపడేసిన పాటల పుస్తకాలను వెతికి సాధన ప్రారంభించాను. మీనుంచి స్ఫూర్తి పొంది పూర్తి కమిట్‌మెంట్‌తో సాధన చేశాను. తర్వాత సినిమాల్లో అవకాశాలొచ్చి సినీ గాయనిగా మంచి గుర్తింపు తెచ్చుకున్నాను."

"మీరు ప్లేబ్యాక్ సింగర్ ప్రియ కదూ?" అన్నాడు ప్రశాంత్. ఆమె ఎవరో తను కనుక్కోగలిగానన్న ఆనందం అతని ముఖంలో కన్పించింది.

అవునన్నట్టు తలూపింది.

"మా అమ్మకు మీరన్నా, మీ పాటలన్నా చాలా ఇష్టం!"

"మీకు ఇష్టం లేదా?" నవ్వుతూ అడిగింది.

"నాకూ ఇష్టమే! క్రికెట్ తర్వాత నేనిష్టపడేది సంగీతాన్నే! మీరు ఈమధ్య పాడిన 'నా మదిలో పూచిన ప్రేమపుష్పం నువ్వే సుమా!' అన్న పాట నాకు చాలా ఇష్టమైన పాట. చాలా బాగా పాడారు ఆ పాట మీరు."

"థాంక్యూ..." అంది సంతోషంగా ప్రియ.

"నన్ను ప్రోత్సహించాలని మీకెందుకు అన్పించింది?" ప్రశాంత్ అడిగాడు.

"మీరు నాకు స్ఫూర్తి నిచ్చారు కనుక! అంతేకాదు- మీ ఇంటికి బంధువులంటూ ఎవరూ రాకపోవడం గమనించాను. ఒకరోజు రాత్రి మీరు 'ఆప్తబంధువులంటూ ఎవరూ లేకపోవడం ఎంతో బాధిస్తోందని' మీ అమ్మగారితో అనడం, ఆవిడ మిమ్మల్ని ఓదార్చడం నాకు వినిపించింది.

నా మనసు ఎంతో బాధపడింది. మీపై ఎంతో జాలి కలిగింది. ప్రయత్నించి మీకు ఆప్తమిత్రురాలు కావాలని ఆనాడే అనుకున్నాను. ఇంతలో మా ఇల్లు పూర్తయి మేము మెహిదీపట్నం వెళ్లిపోయాము.

రంజీ మ్యాచ్ ఆడే హైదరాబాద్ టీములో మీ పేరుండడం చూశాను. అదృష్టవశాత్తూ మొదటి మ్యాచ్ హైదరాబాద్‌లోనే జరిగింది. నేను మీకు ఫోను చేసి, రికార్డింగ్ లేని సమయాల్లో స్టేడియంకి వచ్చి మిమ్మల్ని ప్రోత్సహించాను. వయసులో ఉన్న మగవాడికి ఆడదాని ప్రోత్సాహం ఎంతో శక్తి నిస్తుంది. మానసిక బలాన్నిస్తుంది. ఆమె మెప్పు పొందాలన్న కోరిక బలమై బాగా ఆడేలా చేస్తుంది. మీ విషయంలో అదే జరిగింది. మీ అమ్మగారికి ఫోన్ చేసి, మీ స్నేహితురాలినని చెప్పి మీ సెల్‌నంబరు తీసుకున్నాను. నాకూ క్రికెట్ అంటే ఆసక్తి, ఆ ఆట గురించిన పరిజ్ఞానం ఉన్నందువల్ల ధైర్యంగా ఫోన్ చెయ్యగలిగాను."

ప్రశాంత్ మనసు ఆమె పట్ల కృతజ్ఞతతో నిండిపోయింది.

ఇంతలో... ప్రశాంత్ తల్లి టిఫిన్ ప్లేట్లతో వచ్చింది. ప్రియను సినీగాయనిగా గుర్తుపట్టి, పలుకరించింది.

"అంత గొప్ప గాయని మా ఇంటికి రావడం మా అదృష్టం!" అంది.

"భలేవారే! ఇప్పుడు నాకంటే మీ అబ్బాయి ఇంకా ఎక్కువ పేరు ప్రఖ్యాతులు సంపాదించారు. ఓ క్రికెట్ స్టార్‌కు తల్లి మీరిప్పుడు! మీ ఇంట్లోకి వచ్చి మీతో ఇలా మాట్లాడడం నా అదృష్టం..." అంది ప్రియ.

టిఫిన్, కాఫీలు ముగించాక-

"ఇక నేను బయలుదేరుతాను. మీరిద్దరూ మా ఇంటికి తప్పకుండా రావాలి!" అంటూ ప్రశాంత్‌కి తన విజిటింగ్ కార్డు ఇచ్చింది ప్రియ.

ప్రశాంత్ ఆమెతో పాటు నడుస్తూ కారు వరకూ వచ్చాడు.

ఆమె కారులో కూర్చున్నాక- "మీ స్నేహం ప్రోత్సాహం నాకు ఎల్లప్పుడూ ఉండాలి!" అన్నాడు.

ప్రియ నవ్వి, "తప్పకుండా ఉంటుంది!" అంది.

కారు కదిలింది.

ఆమెకి 'టాటా' చెప్పి ఇంట్లోకి వచ్చాడు ప్రశాంత్.

"అమ్మాయి కుందనపు బొమ్మలా ఉందిరా! 'ఆట'కు 'పాట' తోడైతే జీవితం మధురంగా ఉంటుంది" అంది ప్రశాంత్ తల్లి- అతనేమంటాడో అని ఆసక్తిగా చూస్తూ.

"చూద్దాం అమ్మా... నాకేం అభ్యంతరం లేదు. కాని, మేమిద్దరం ఇంకా మా కెరీర్ ప్రారంభ దశలోనే ఉన్నాము. సాధించవలసింది ఎంతో ఉంది. నేనూ జట్టులో నిలదొక్కుకోవాలి.. మరి కొన్నేళ్లు మా మా రంగాల్లో కృషి చేసి, ఎక్కవలసిన మెట్లలో సగమన్నా ఎక్కాక- అప్పుడు పెళ్ళి గురించి ఆలోచిద్దాము. అంతవరకూ ఆమెను ఓ స్నేహితురాలిగా గౌరవిస్తూ ఉంటాను, ఓ స్నేహితుడిగా కలుస్తూ ఉంటాను" అన్నాడు ప్రశాంత్.

అతని ముందుచూపుకి, కెరీర్ పట్ల శ్రద్ధకి మనసులోనే అభినందించింది అతని తల్లి.